ప్రజాశక్తి
శుక్రవారం 14 జులై 2023
5
విజయనగరం



దిశ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ఎస్‌పి ఎం.దీపిక గురువారం దిశ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, స్టేషను రికార్డులు, రిసెప్షన్ రికార్డులు, సిడి ఫైల్స్ ను తనిఖీ చేశారు. మహిళల రక్షణకు, భద్రతకు ప్రత్యేకంగా రూపొందించిన దిశ యాప్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీసు స్టేషనుకు వచ్చే బాధితుల సమస్యలను తెలుసుకొని, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో దిశ ఇన్‌ఛార్జ్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సిఐ బి.నాగేశ్వరరావు హాజరై నమోదైన కేసుల్లో సాధించిన ప్రగతిని ఎస్‌పికి వివరించారు.



స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి దీపిక



వరి విత్తనాలు జల్లుతున్న రైతు

వెంటాడుతున్న వర్షాభావం

వర్షాభావం వెంటాడుతుండడంతో వరి నారుపోతలు మందకొడిగా సాగుతున్నాయి. రైతులంతా వరుణుడిపైనే ఆశలు పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. జిల్లాలో సాధారణంగా జూన్ రెండో వారం నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతుంది. ఈ ఏడాది రుతుపనాలు జులై మొదటివారం వరకు జిల్లాను తాకలేదు. గడిచిన వారంలో కురిసిన వర్షాలకు అక్కడక్కడ వరినారుపోతలు ప్రారంభమయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే వర్షపాతంతో పాటు వరినాట్లు కూడా తక్కువగానే కనిపిస్తున్నాయి.

- మందకొడిగా వరినారు పోత
- ఆశలన్నీ వరుణుడిపైనే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వర్షాభావం వెంటాడుతుండడంతో వరి నారుపోతలు మందకొడిగా సాగుతున్నాయి. రైతులంతా వరుణుడిపైనే ఆశలు పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. జిల్లాలో సాధారణంగా జూన్ రెండో వారం నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతుంది. ఈ ఏడాది రుతుపనాలు జులై మొదటివారం వరకు జిల్లాను తాకలేదు. గడిచిన వారంలో కురిసిన వర్షాలకు అక్కడక్కడ వరినారుపోతలు ప్రారంభమయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే వర్షపాతంతో పాటు వరినాట్లు కూడా తక్కువగానే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ పంటలన్నీ కలిపి 3,13,465 ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా 2,25,637 ఎకరాల్లో వరి సాగు కావాల్సివుంది. కానీ, ఇప్పటి వరకు కేవలం 4,270 ఎకరాల్లో మాత్రమే రైతులు వరినారు పోశారు. ఈ నారు కేవలం 85,400 ఎకరాలకు మాత్రమే సరిపోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది ఇదే సమయానికి 9,477 ఎకరాల్లో వరినారు పోశారు. దీన్నిబట్టి గత ఏడాదితో పోల్చినా సగానికి సగం తక్కువ నారు పోసినట్టుగా స్పష్టమౌతోంది. రుతుపనాలు సకాలంలో వచ్చి, వర్షాలు అనుకూలంగా కురిస్తే ఈ సమయానికి నారుపోత కనీసం 95శాతం పూర్తయ్యేదని పలువురు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం అరకొర నారుపోతలోనూ రాజాం, బొబ్బిలి వ్యవసాయ సబ్-డివిజన్లలో కాస్త ఎక్కువగా ఉంది. విజయనగరం సబ్ డివిజన్ పరిధిలో అత్యల్పంగా 42హెక్టార్లలోనూ, కొత్తవలస సబ్-డివిజన్‌లో 97హెక్టార్లలోనూ విత్తనాలు నాటారు. ఇక వర్షపాతాన్ని పరిశీలిస్తే సీజన్ ప్రారంభం నుంచి (జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు) 167 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతంకాగా 126.7 వర్షపాతం మాత్రమే నమోదైంది. దీన్ని బట్టి ఇప్పటికీ 24.1మిల్లీ మీటర్ల లోటు వర్షపాతం ఉంది. జులైలో అయితే 51.9 మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. దీన్నిబట్టి గడిచిన పది రోజుల్లోనే వర్షాలు కాస్త పడ్డాయన్నది స్పష్టమౌతోంది.

మరోవైపు ఆంధ్ర, తాడిపూడి తదితర జలాశయాల్లో కూడా నీటి నిల్వలు సీజన్‌కు తగినంతగా లేకపోవడం రైతులను ఒకింత కలవరపాటుకు గురిచేస్తోంది. మరోవైపు ఇరిగేషన్ భూమి అధికారిక లెక్కల్లో 80శాతానికిపైగా ఉన్నప్పటికీ ఆచరణలో 50శాతానికి మంచి నీరు అందడం లేదు. ఈనేపథ్యంలో ప్రస్తుతం నెలకున్న వర్షాభావ పరిస్థితి మరికొన్నాళ్లు కొనసాగితే కేవలం వరిపంటపైనే కాకుండా మొక్కజొన్న, చెరకు, పత్తి, అపరాలు తదితరాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ ధ్రువపత్రాలు

- పూర్తయిన భవనాలను ప్రారంభించాలి
- పిహెచ్‌సిల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-మెరకముడిదాం

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న అర్హులకు ధ్రువపత్రాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలపై ఆరా తీయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన 11 రకాల సేవలను ఉచితంగా అందజేయాలని చెప్పారు. మెరకముడిదాం మండలంలో ఆమె గురువారం విస్తతంగా పర్యటించారు. అభివృద్ధి పనులను పరిశీలించి, మండల అధికారులకు పలు సూచనలు చేశారు. పోషకాహార పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలు, అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణ, ఎనీమియా, పోషకాహార లోపం, సంపూర్ణ పోషణ, పిల్లలకు ఆరోగ్య తనిఖీలు తదితర అంశాలపై ఆరా తీశారు. గరుగుబిల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఇంటింటి సర్వే పై ఆరా తీశారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులను పరిశీలించి, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కిచెన్ షెడ్ ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని, రాగి జావ ను రుచి చూశారు. పదో తరగతి విద్యార్థుల పాఠ్య పఠనా స్థాయిని పరిశీలించారు.

భవనాలను వెంటనే ప్రారంభించాలి

నిర్మాణం పూర్తయిన సచివాలయం, ఆర్‌బికె, వెల్నెస్ సెంటర్ భవనాలను ఈ నెలాఖరులోగా ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సాతాంవలస గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయాన్ని తనిఖీ చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు అందజేస్తున్న పోషకారం, విద్యా బోధన, ఆరోగ్య తనిఖీలు, గర్భిణులకు అందజేస్తున్న పోషకాహారం అంశాలపై ఆరా తీశారు. వివిధ రికార్డులను తనిఖీ చేశారు.

రీ సర్వే త్వరగా పూర్తి చేయాలి

భూముల రీ సర్వే ప్రక్రియను మండలంలో త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని తాహశీల్దార్ కార్యాలయాన్ని, ఎంపిడిఒ కార్యాలయాన్నికలెక్టర్ సందర్శించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. పాత తాహశీల్దార్ కార్యాలయం మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. బుదరాయవలస గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలు, ఓపీ , రక్త హీనత కేసులు తదితర అంశాలపై ఆరా తీశారు. పిహెచ్‌సిల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని, రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. పర్యటనలో చీపురుపల్లి ఆర్‌డిఒ ఎం.అప్పారావు, డిఎల్‌డిఒ నిర్మలాదేవి, డిప్యూటీ ఇఒ బ్రహ్మాజీ, డ్వామా ఎఒ లక్ష్మణ్ , తాహశీల్దార్ విజయభాస్కర్, ఎంపిడిఒ రత్నం, ఎఒ శ్రావణి తేజ, ఎంఇఒలు, ఇంజినీరింగ్ అధికారులు, డాక్టర్లు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గరుగుబిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి



విత్తనాలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

తప్పిదాలు జరగకుండా వివరాలను నమోదు

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-బొండపల్లి

అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ- సర్వే ప్రక్రియలో వివరాల నమోదులో అధికారులు, సిబ్బంది తప్పిదాలు జరగకుండా వివరాలు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ పేర్కొన్నారు. గురువారం బొండపల్లిలో పర్యటించిన ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వెక్టరైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. సర్వేయర్, విఆర్ఒ, తహశీల్దార్ లాగిన్లలో పెండింగ్ నివేదికలను ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకొని మరింత పురోగతి సాధించాలని ఆదేశించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఈ క్రమంలో రైతులకు విత్తనాలను అందజేశారు. ఆయన వెంట స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వే విభాగపు అధికారులు తదితరులు ఉన్నారు.

రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో జనవరి నెల నుండి ఇప్పటివరకు 'న్యూ మరియు స్ప్లిట్ కార్డ్స్ లకు అప్లై చేసిన వారందరికీ కొత్త రైసు కార్డులు వచ్చాయని కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా అప్లై చేసుకోవలిసిన వారు వుంటే ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వారందరికీ కొత్తకార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

మైనార్టీల సమస్యలు పట్టవా?

ప్రజాశక్తి-విజయనగరంకోట

మైనారిటీల సమస్యలు వైసిపి ప్రభుత్వానికి పట్టవా? అని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా ప్రశ్నించారు. గురువారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మైనార్టీలకు ఆర్థికంగా విద్యా వైద్యం, ఉపాధి పరంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తీసుకువస్తే, నేడు అటువంటివేవి అమలు కావడం లేదని అన్నారు. దుల్హాన్ పథకంలో ఒక్కొక్క ఆడపిల్లకు రూ.50వేలు టిడిపి ప్రభుత్వం ఇస్తే నేడు వైసిపి ప్రభుత్వం ఏమిచ్చిందని అన్నారు. ప్రభుత్వం స్పందించి మైనార్టీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

20 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- 19 నాటికి ఏర్పాట్లు పూర్తి కావాలి
- కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 20 నుండి జిల్లాలో నిర్వహించే ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి లైన్ డిపార్టుమెంటు అధికారులంతా తమ శాఖలకు అప్పగించిన ఏర్పాట్లను ఈనెల 19 నాటికే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రోజుకు కనీసం వెయ్యి మంది అభ్యర్థులు హాజరు అయ్యే అవకాశం ఉందని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ర్యాలీని విజయవంతం చేయాలని సూచించారు. ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి వారితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లను చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధికారులతో ఏర్పాట్లు, నిధుల సమీకరణ, ఖర్చుల పై సమీక్షించారు. ఈర్యాలీ కి అన్ని శాఖలు సమన్వయం తో పని చేయాలన్నారు. పి.టి.సి లో జరిగే ఈ ర్యాలీ కి అవసరమైన బారికాడింగ్ , రన్నింగ్ ట్రాక్ , రైన్ ప్రూఫ్ షెల్టర్స్ , షామియానాలు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలని, పోలీస్ అధికారులకు, లైటింగ్, విద్యుత్ ఏర్పాట్లను చేయాలని, విద్యుత్ అధికారులకు , సిసి టి వి లను, ఐ.టి కు సంబంధించిన కార్యక్రమాలను డిఐఒ చూడాలని సూచించారు. అవసరం మేరకు వాహనాలను , బస్సు లను ఏర్పాటు చేయాలని జిల్లా రవాణా అధికారికి సూచించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లో మాట్లాడగల ఉపాధ్యాయులను అనౌన్సుమెంట్ కోసం ఏర్పాటు చేయాలని డిఇఒకు సూచించారు. సెట్విజ్ సిఇఒ అందరి అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సమన్వయం చేసుకోవాలని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎస్‌పి దీపికా పాటిల్ , సెట్విజ్ సిఇఒ బి. రాంగోపాల్ , మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, డిఎస్‌పి శేషాద్రి, డిఇఒ లింగేశ్వర రెడ్డి, ఆర్ అండ్‌బి ఇఇ వెంకట రమణ, అన్ని శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, జెసి



డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

అక్రమ బదిలీల రద్దుకు యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అక్రమ బదిలీలు రద్దు చేసి, బదిలీ అయిన ఉపాధ్యాయులు వేతనాలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధా కార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో ఉపాధ్యాయ బదిలీల కౌన్సిలింగ్ జరిగిందని, ఆ కౌన్సిలింగ్ లో కాకుండా సిఫార్సులు ఆధారంగా అనేక బదిలీలు ఇటీవల జరిగాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వేతనాలు వేయలేదని, వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎడికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో జిల్లా గౌరవ అధ్యక్షులు సత్యశ్రీనివాస్, తిరుపతి నాయుడు, రాజారావు, ప్రసాద్, కె.శ్రీనివాస్, రామకృష్ణ, నిర్మల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాతీ వాటర్ ప్లాంట్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

పట్టణ పౌరసంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యప్ప నగర్ సర్వే నెంబర్ 136 లో గెడ్డ ను ఆక్రమించి అక్రమంగా స్వాతి ప్యూర్‌ఫెయిడ్ వాటర్ ప్లాంట్ యాజమాన్యం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుం టోందని, అధికారులు ఆ స్థలాన్ని సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు, కాలనీ అసోసియేషన్ నాయకులు యుఎస్ రవికుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి అందజేశారు. గత 10 ఏళ్లుగా గెడ్డను సుమారు 500 గజాలు పైగా ఆక్రమించినప్పటికీ రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోక పోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని, తద్వార అయ్యప్ప నగర్ ముంపునకు గురి కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ , అధ్యక్షుడు ఎ.జగన్మోహన్ పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతినిస్తున్న పట్టణపౌరసంక్షేమ సంఘం నాయకులు

శిల్పారామంలో విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



రేపటి తరానికి మన దేవతల విశిష్టతను, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను తెలియజేయాల్సిన అవసరం అందరిపైనా ఉందని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. స్థానిక శిల్పారామం వద్ద ఆర్య వైశ్య సంఘం నాయకులు, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, ఏడుకొండలు కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి, మహాత్మా గాంధీ విగ్రహాలను ఆమె గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేడు పర్యాటకంగా నగరం అభివృద్ధి చెందుతోందన్నారు. పర్యాటకులను, స్థానికులను ఆకర్షించేలా ఏ కార్యక్రమమైనా శిల్పారామం వేదికగా జరగాలని.. తద్వారా మన ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు మండవిల్లి వెంకటరాజు, కుమ్మర గంటి శ్రీనివాసరావు, బండారు శేఖర్, తవ్వా మోహనరావు, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బంగారు పతకం సాధించిన హారిక

వెయిట్ లిఫ్టింగ్‌లో హారికకు బంగారు పతకం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండ వెలగాడకు చెందిన బెల్లాన హారిక బంగారు పతకం సాధించింది. గురువారం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం నోయిడాలో గౌతమ బుద్ధ యూనివర్శిటీలో జరిగిన కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ యూత్ గేమ్స్ 2023 పోటీల్లో హారిక బంగారు పతకం సాధించింది. 59 కిలోల విభాగంలో 172 కేజీల బరువెత్తి బంగారు పతకం సాధించింది. హారిక గతంలో ఖేలో ఇండియా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించింది. ఆమె తండ్రి కూలీ పనులు చేసుకుంటూ హరికను జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించడానికి ప్రోత్సహించారు. హారికను ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ గదల బంగారమ్మ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, గ్రామస్థులు అభినందించారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

కమిషనర్ శ్రీరాములు నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు అన్నారు. గురువారం నగరంలోని 20, 21, 22, 23,24 డివిజన్లకు సంబంధించి ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకం అమలు కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 2,534 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను సులభతర రీతిలో పూర్తి ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్పటికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత చూపుతున్నారని అన్నారు.కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బవిరెడ్డి సతీష్, పిల్ల రాధా భవాని, కంటుభుక్త తవిటిరాజు, కనకల నాగవల్లి, వైసిపి నాయకులు కేదారిశెట్టి లక్ష్మణరావు, రామేశ్వరపు రామారావు, కనకల గిరి, అవినాపు లక్ష్మణరావు, ఎసిపిలు మధుసూదన్ రావు, అమ్మాజీ రావు,నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి ఛైర్మన్‌కు పిత్ళ వియోగం

పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధుల నివాళి
ఫోన్‌లో ముఖ్యమంత్రి పరామర్శ

ప్రజాశక్తి. -విజయనగరం టౌన్

జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను)కు పిత్ళ వియోగం కలిగింది. ఆయన తండ్రి మజ్జి నరసింగరావు గురువారం వేకువ జామున ఆస్పత్రిలో కన్నుమూశారు. నర్సింగరావు స్వయానా రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యన్నారాయణకు మేనమామ, మాజీ ఎమ్‌పి బొత్స ఝాన్సీలక్ష్మికి చిన్నాన్న. ఆయనకు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు. ప్రదీప్ నగర్‌లోని మజ్జి శ్రీనివాసరావు నివాసం వద్ద ఉంచిన ఆయన భౌతిక కాయాన్ని ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, శంబంగి వెంకట చినప్పలనాయుడు, అలజంగి జోగారావు, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, పి.రఘువర్మ, రఘురాజు, పాలవలస విక్రాంత్, మేయర్ విజయలక్ష్మి, జిసిసి ఛైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి, డిసిఎంఎస్ ఛైర్మన్ అవనాపు భావన, డిసిసిబి ఛైర్మన్ వి.చినరామునాయుడు, జనసేన నాయకులు పాలసవలస యశస్విని,పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం తోటపాలెం శ్మశాన వాటికలో నర్సింగరావు మృతదేహాన్ని అంత్య క్రియలు నిర్వహించారు.



నర్సింగరావు (ఫైల్)



నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి బొత్స

ఫోన్‌లో ముఖ్యమంత్రి పరామర్శ

జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావును ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకున్నారు. శ్రీనివాసరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు .

విద్యాశాఖా మంత్రి బొత్సన నివాళి

తన మేనమామ అయిన మజ్జి నర్సింగరావుకు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ఘనంగా నివాళులు అర్పించారు. మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపి బొత్స ఝాన్సీ లక్ష్మి దంపతులు సాయంత్రం చిన్న శ్రీను ఇంటికి వెళ్లి నర్సింగరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, నర్సింగరావు మతి పట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు కూడా నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ట్రిపుల్ ఐటిలో జిల్లా విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- బొండపల్లి

ట్రిబుల్ ఐటి ఫలితాల్లో బొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన గెద్ద ప్రవల్లిక, శిరువూరి సాయి చంద్ర నికిత, యుదవ నిర్జర, నూజివీడు క్యాంపస్‌కు, ముద్దాడ రేణుక, గొండెల స్వరూప శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. విద్యార్థులను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మెన్ గెద్ద సత్యనారాయణ, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నెల్లిమర్ల: మండలంలోని మొయిద జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. గురువారం విడుదలైన ఫలితాల్లో పాఠశాలకు చెందిన పి. అస్మిత నూజివీడు ట్రిపుల్ ఐటీకి, ఎస్. ప్రవీణ్ శ్రీకాకుళం ఐటీకి ఎంపికయ్యారు. అస్మిత పదో తరగతిలో 575, ప్రవీణ్ 565 మార్కులు సాధించినందుకు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యా హెచ్‌ఎం తెలిపారు.

వేపాడ: మండలంలోని బక్కునాయుడు పటే ఎపి ఆదర్శ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఐఐటికి ఎంపికయ్యారు. నూజివీడు బ్రాంచికి ముచ్చకర్ల స్వాతి, భోజనంకి రవీంద్ర, శ్రీకాకుళం బ్రాంచ్‌కి అరిగి శ్రీనివాస్, కర్రీ మేఘన, గళ్ళ గ్రీష్మణి, గాయత్రి, కసగాడ వాసవి, ఆర్కె వ్యాలీ బ్రాంచ్‌కి బోజంకి భాను ప్రసాద్ ఎంపికయినట్లు ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు.



బొండపల్లి: ట్రిపుల్ ఐటికి ఎంపికైన బొండపల్లి జిల్లా పరిషత్తు పాఠశాల విద్యార్థినులు



ఎస్‌కోట: ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తవలస: స్థానిక ఎపి మోడల్ స్కూల్లో చదువుతున్న నలుగురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పి. శివప్రసాద్ తెలిపారు. ఉగ్గిన మనోజ్ సాయిశ్రీ నూజువీడుకు, గంగున లక్ష్మీ ప్రసాద్ ఒంగోలుకు, లెంక నాగ సిద్ధు వర భాను మనోజ్, గంతకోరు కార్తిక్ శ్రీకాకుళం ఐఐటికు ఎంపికయ్యారని తెలిపారు. ఈ విద్యార్థలను ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు అభినందించారు.

శృంగవరపు కోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన మిడతాన లిఖిత, కరగాన జాహ్నవి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఇంచార్జి హెచ్‌ఎం ఎస్. శివరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఈ ఇద్దరు విద్యార్థినిలకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిడతాన లిఖిత 569 మార్కులు, కరగాన జాహ్నవి 565 మార్కులు సాధించి ఐఐటికి ఎంపికయ్యారన్నారు. ఈ ఇద్దరు విద్యార్థినిలు ధర్మవరం హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్‌లో ఇంటర్మీడియట్ ఎంపిపి గ్రూపులో చేరినట్లు తెలిపారు.

జామి: మండలంలోని కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. వీరిలో పి.కుసుమ, ఎస్.సాధన, ఎస్.గౌతం నూజివీడుకు, వై.నిరుపమ, వై.భార్గవి, వి.మృదుల, పి భార్గవి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరంతా వ్యవసాయ ఆధారిత గ్రామీణ కుటుంబాలకు చెందిన వారు కావడం విశేషం.

ఐఐఐటికి తాడేల బ్రాహ్మిణి ఎంపిక



మెరకముడిదాం: మండలంలోని గర్భాం గ్రామానికి చెందిన తాడేల శంకరరావు కుమార్తె తాడేల బ్రాహ్మిణి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఐఐఐటికి ఎంపికైంది. బ్రాహ్మిణి గర్భాం ఆదర్శ పాఠశాలలో పదో తరగతిలో 571 మార్కులు సాధించి ఐఐఐటికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెకు కుటుంబ సభ్యులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



కొత్తవలస: ట్రిపుల్ ఐటికి ఎంపికైన కొత్తవలస మోడల్ స్కూల్ విద్యార్థులు

నకిలీ ఇళ్ల పట్టాలపై సిఐడి దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

నకిలీ ఇళ్ల పట్టాలపై సిఐడి దర్యాప్తు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాలతో ఇళ్ల స్థలాలు అక్రమించేసి అమ్ముకుంటున్నారని విమర్శించారు. నకిలీ ఇళ్ల పట్టాలు తయారీకి అధికార పార్టీ నేతలకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారన్నారు. అధికార పార్టీ నేతల నుంచి ఒక విఆర్‌ఒ డబ్బులు తీసుకుని నకిలీ పట్టాలు తయారు చేసి ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ కాలనీలో ధనికులు పాగా వేస్తున్నారని విమర్శించారు. గతంలో కూడా ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను ఆక్రమించేసి అమ్ముకున్నారన్నారు. కాలనీలో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పట్టాలు ఇవ్వాలని లేదంటే ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. నకిలీ పట్టాలపై సిఐడి దర్యాప్తు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం ఉన్నారు.

అమ్మఒడి ఎప్పుడిస్తారు?

ప్రజాశక్తి- బొబ్బిలి

అమ్మఒడి అందరికీ ఎప్పుడు ఇస్తారని ఎపి విద్యార్థి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ ప్రశ్నించారు. స్థానిక గుండాల చెరువు వైఎస్ఆర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మఒడి డబ్బులు బటన్ నొక్కి వారం రోజులు పైగా అవుతున్న కొంతమంది ఖాతాలో పడి కొంతమంది ఖాతాల్లో పడలేదన్నారు. దీంతో డబ్బులు పడని తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగన్ నొక్కిన బటన్ రిపేరు కారణంగా డబ్బులు పడలేదేమోనని ఎద్దేవా చేశారు. అనంతరం డాక్టర్ వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. మరో మూడు రోజుల్లో డబ్బులు పడకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పి ప్రసాద్, అనిల్, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని మధుపాడలో నూతనంగా నిర్మిస్తున్న అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్‌రావు రూ. 50వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. గురువారం తన స్వగృహంలో చెక్కును ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నల్లం శ్రీనివాసరావుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

హౌస్ హోల్డింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఒకే రేషన్ కార్డులో ఇద్దరికీ పింఛన్ ఇచ్చే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని దీని కోసం పింఛనర్లు హౌస్‌హోల్డ్ స్ప్లిట్టింగ్ చేయించుకోవాలని తహశీల్దార్ డి. రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే హౌస్ హోల్డ్‌లో ఇద్దరు వితంతువులు ఉండి వారిలో ఒకరికి 60 సంవత్సరాలు నిండి మరొకరికి 60 లోపు ఉంటే వారిద్దరికీ పింఛను వచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇటువంటి వారు సురక్ష కార్యక్రమం, స్పందన కార్యక్రమం ద్వారా హౌస్ హోల్డ్ స్ప్లిట్టింగ్ చేసుకోవాలన్నారు. పింఛనర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

అమ్మాయిలూ.. తస్మాత్ జాగ్రత్త!



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ పల్లవి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అమ్మాయిలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని, మోసానికి గురికాకుండా తెలివిగా వ్యవహరించాలని రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో గురువారం సెంచూరియన్ కెపాసిటీ అండ్ కాంపిటెన్సీ డెవలప్మెంట్ సెంటర్ (సిసిసిడిసి) ఆధ్వర్యంలో 'జెండర్ రోల్స్ అండ్ జెండర్ సెన్సిటైజేషన్' సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో అమ్మాయిలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? మగాళ్లతో ఎలా ప్రవర్తించాలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్‌ఎన్ ఆచార్యులు, బెనర్జీతో పాటు పలువురు ఇంజనీరింగ్, పారా మెడికల్ కోర్సులకు సంబందించిన విద్యార్థినులు పాల్గొన్నారు.

పలు భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని అలుగుబిల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైయస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. అనంతరం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ధృవపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, కొట్యం చంద్రారావు, జెసిఎస్ మండల ఇంఛార్జి వాకాడ సతీష్, పోతనపల్లి వెంకటరావు, ఎఎంసి డైరెక్టర్ పద్మా, మోడేకాశీ విశ్వనాథ్, బీల వెంకట్రావు, చామలపల్లి సర్పంచ్ జుత్తాడ సూర్యారావు, రాయవరపు సత్యం మాస్టారు, రాయవరపు జగన్నాథం, కిలపర్తి సత్యం, వీరనారాయణ, సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బేబినాయన ఆర్థిక సాయం

ప్రజాశక్తి- బాడంగి

బొబ్బిలి నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి బేబినాయన మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. మండలంలోని ఆకులకట్ట గ్రామానికి చెందిన తవటిరాజు, కంటు అప్పమ్మ ఇద్దరికి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన ఇద్దరికీ చెరో రూ.5వేల చొప్పున రూ. 10వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంకు బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి- విజయనగరం

స్థానిక కెఎల్‌పురంలో గురువారం ఇండియన్ బ్యాంకు 48 శాఖ ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాదుకు చెందిన ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేశరామన్ నూతన శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఈ శాఖను వినియోగించుకోవాలన్నారు. ఇండియన్ బ్యాంక్ మొత్తం రూ.10లక్షల కోట్ల లావాదేవీలతో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఇండియన్ బ్యాంక్ జోన్ మేనేజర్ వెంకటరమణరావు, కెఎల్‌పురం బిఎం సిహెచ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకును ప్రారంభిస్తున్న గణేశరామన్

చెత్త రీసైక్లింగ్ ప్రారంభానికి చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ పాత డంపింగ్ యార్డులో చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు లేగిసివ్ మేనేజ్మెంట్ మిషన్‌కు బాధ్యతలు అప్పగించారు. చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు అనువుగా పాత డంపింగ్ యార్డును చదును చేస్తున్నారు. భూమి చదును పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. రీసైక్లింగ్ పనులు ప్రారంభించి పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ డిఇ రవిను ఆదేశించారు.



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నాటక రంగానికి స్ఫూర్తి ప్రదాత

ప్రజాశక్తి- విజయనగరం కోట

నాటక రంగానికి, అనేక మంది కవులకు స్ఫూర్తి ప్రదాత కొమర్రాజు వెంకట లక్ష్మణరావు అని శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్‌బి రామానాయుడు కొనియాడారు. గురువారం గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో లక్ష్మణరావు వర్థంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం విద్యార్థులతో లక్ష్మణరావు వేషధారణలు వేయించారు. నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ తెలుగులో మొట్టమొదట విజ్ఞాన సర్వస్వ నిర్మాత, తెలుగు వారికి చరిత్ర పరిశోధనలు పరిచయం చేసిన సాహిత్య వేత్త లక్ష్మణరావు అని అన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కడుబండి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కొత్తవలస

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలు కొత్తవలసలో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కాకర గౌరీ శంకర్, సత్యవాణి దంపతులు ఏర్పాటు చేసిన సిబిరంలో ఎమ్మెల్యేకు దుస్సాలువ కప్పి, కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది వృద్ధులకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ దమ్ము రమణ, తుమ్మకాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, పల్లా భీష్మ, భోని వెంకట అప్పారావు, వైపాడ ఎంపిపి డి సత్యవంతుడు, జెడ్‌పిటిసి ఎస్ అప్పలనాయుడు, డిసిసిబి చైర్మన్ వివి చిన్న రామునాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

జామి, శంగవరపుకోట: ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు జన్మధిన వేడుకలు ఎస్.కోట పట్టణ కేంద్రంలోని శిరికి రిసార్ట్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి నియోజకవర్గంలోని ఐదు మండలాల వైసిపి నాయకులు కార్యకర్తలు మధ్య కేక్ కట్ చేయగా, కడుబండిని కలిసిన వారంతా తమ నాయకుడుకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా ఎమ్మెల్యే పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రజాశక్తి తీసుకొచ్చిన ప్రత్యేక సంచికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొప్పలి వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, వైసిపి మండల కన్వీనర్ జి.రవికుమార్, ఎస్.కోట నాయకులు వాకాడ రాంబాబు, జామి మండలం చింతాడ సర్పంచ్ అప్పాన సుబ్రమణ్యం, వైసిపి మండల నాయకులు, అధికారులు, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

ఫీజుల దోపిడీని అరికట్టాలి

బొబ్బిలిరూరల్ : బొబ్బిలిలో ఉన్న ప్రవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఇఒకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా సహా కార్యదర్శి బి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో నోటీసు బోర్డులో ఫీజు స్ట్రక్చర్ వివరాలను అమలు చేయాలన్నారు. హాస్టల్ పరిమిషన్ లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలన్నారు. వేరే వేరే కోర్సులు పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి డబ్బుల్ని పిండేస్తున్నారన్నారు. విద్య హక్కు చట్టం ప్రకారం ప్రతి విద్యాసంస్థలో నోటీసు బోర్డు అతికించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ మండల నాయకులు పోలిరాజు, వికాస్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

డెంగీ నివారణపై ర్యాలీ

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ వ్యాధి నివారణ వారోత్సవాలలో భాగంగా గురువారం వేపాడలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ధరణి మాట్లాడుతూ వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో, గుంతలలో నీటి నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. డ్రై డే పాటించాలని ఈగలు, దోమలను నిర్మూలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే రాజు, సిహెచ్‌ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి సిబ్బంది ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంకాడలో వాలంటీర్ల నిరసన


ప్రజాశక్తి- డెంకాడ

వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా డెంకాడ మండల కేంద్రంలో డెంకాడ వాలంటీర్లు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను గురువారం దగ్ధం చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డెంకాడ పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, స్థానిక సర్పంచ్ గౌరి, వైస్ సర్పంచ్ ఆది, గోపాల కృష్ణ, నాగభూషణం, సురేష్, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మరిన్ని సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి గజపతినగరం

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక అన్నారు. గురువారం పురిటిపెంట-1 సచివాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలను ప్రభుత్వం సచివాలయం ద్వారా ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ సేవలు అవసరమైన వాళ్లు వాలంటీర్లను సంప్రదించాలని తెలిపారు. వాలంటీర్, సచివాలయం వ్యవస్థతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక, ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేక కొంతమంది పనిగట్టుకుని వాలంటరీ వ్యవస్థపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. అనంతరం 926 మంది లబ్ధిదారులకు పలు రకాల పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, వైసిపి నాయకులు బెల్లాన త్రినాధరావు, కర్రీ రామునాయుడు, జెసిఎస్ కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ కిషోర్ కుమార్, తహశీల్దార్ ఎం.అరుణకుమారి, ఇఒపిఆర్‌డి జనార్ధనరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాడంగి : ధ్రువపత్రాన్ని అందుకుంటున్న ఎంపిటిసి గౌరు

బాడంగి : జగనన్న సురక్ష పేద ప్రజలకు రక్ష అని జెడ్‌పిటిసి రామారావు అన్నారు. మండలంలోని డొంకినవలస సచివాలయ పరిధిలో ఉన్న లక్ష్మీపురం, ఎరుకల పాకాల గ్రామాలలో జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకర్ ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 100శాతం పేదలకు న్యాయం చేయడమో ధ్యేయంగా 11రకాల సర్టిఫికెట్స్‌ను ఉచితంగా ఇస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోగు గౌరి, తెంటు మధుసూధనరావు, ఎంపిటిసి పాలవలస గౌరు, వైసిపి నాయకులు గండి శంకర్‌రావు, సెక్రటరీ రమేష్, వాలంటీర్లు, గృహ సారధులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ కోరారు. గురువారం నగర పంచాయతీ పరిధి ఇందిరా నగర్ కాలనీ వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి లబ్ధిదారులకు 11 రకాల సర్వీసులకు సంబంధించి 788 ధృవ పత్రాలను జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధృవ పాత్రలు అవసరమైన వారు సురక్షలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వర రావు, మెప్మా సిఎంఎం డి.గోవింద రావు, రెవెన్యూ సిబ్బంది, అగ్రికల్చర్ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.



గజపతినగరం: ధృవపత్రాన్ని అందిస్తున్న ఎంపిపి జ్ఞాన దీపిక

బొబ్బిలిరూరల్ : తమ ప్రభుత్వం ప్రజల వద్దకె ధృవపత్రాలు అంధచే కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చారని ఎంపిపి సంబంగి లక్ష్మి అన్నారు. గురువారం పక్కి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, ఆధాయ, కుటుంబ, తదితర 11 రకాల ధృవపత్రాలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవి కుమార్, డిటి గౌరీ శంకరావు, పంచాయతీ కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసులపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రామాల్లో ఫోక్సో కేసులపై అవగాహన పెంచాలని సిఐ తిరుమలరావు మహిళా పోలీసులకు ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రధాన సమస్యల సత్వర పరిష్కారానికి మహిళా పోలీస్ ప్రధాన భూమిక పోషించాలన్నారు. తరచూ గ్రామాల్లో వచ్చే భూ తగాదాల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. దిశా చట్ట పటిష్ట అమలుకు కృషి చేస్తూ ఈ చట్ట యాప్ ప్రతీ మహిళా వినియోగించేలా అవగాహన పెంచాలని ఆదేశించారు. నూతన వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచి అనుమానితుల వివరాలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతీ చిన్న సమస్యను పెద్ద సమస్య గానే భావించి గొడవలకు ఆస్కారం లేకుండా శాంతి, సామరస్యత నెలకొల్పేందుకు సహకరించాలన్నారు.



రామభద్రపురం: మాట్లాడుతున్న సిఐ తిరుమలరావు

వేపాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫోక్సో చట్టంపై వల్లంపూడి ఎస్ఐ రాజేష్ గురువారం అవగాహన కల్పించారు. క్రమశిక్షణ వల్ల కలిగే ప్రయోజనాలు గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశలోనే చట్టాల గురించి క్షుణ్ణంగా నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రయోజకులుగా ఎదిగే అవకాశాలున్నాయన్నారు.

ఓటర్ల నమోదుకు ఇంటింటి సర్వే

ప్రజాశక్తి- వేపాడ

ఓటు నమోదుకు ఇంటింటి సర్వే తప్పనిసరి అని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం బిఎల్‌ఒలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకూ ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన వారందరికీ ఓటు నమోదు చేయాలన్నారు. ఓటు డిలీట్ చేయడానికి ఫారం7 ఉపయోగించాలని, ఓటు బదిలీ కోసం ఫారం 8ని కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఫారం 6ను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కోట నియోజకవర్గం ఎన్నికల అధికారి, డిప్యూటీ కలెక్టర్ సుదర్శనరావు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎస్‌కోట నారాయణమ్మ, 51 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బిఎల్‌ఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

గజపతినగరం : ఈ నెల 21 నుండి ఇంటింటి సర్వే క్షున్నంగా చేపట్టాలని తహశీల్దార్ ఎం.అరుణకుమారి అన్నారు. తన కార్యాలయంలో బొండపల్లి, గజపతినగరం మండలాల బిఎల్‌ఒలతో ఆమె గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు సర్వేలో బిఎల్‌ఒలది కీలక పాత్ర కాబట్టి సర్వేను పక్కగా నిర్వహించి తప్పులు ఉంటే సరిదిద్దాలని, మార్పులు చేర్పులు ఉంటే తక్షణమే వాటిపై దృష్టి పెట్టాలని అన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఆదిత్యా విద్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయనగరం రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణ శాంతి ఆధ్వర్యంలో కంటి స్క్రీనింగ్ క్యాంప్, చిల్డ్రన్ మెడికల్ క్యాంప్, జనరల్ క్యాంప్, నిర్వచించారు. ఈ శిబిరాన్ని డిజిఇ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. శిబిరంలో 500 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 200 మంది విద్యార్థులకు వెంకట పద్మ ఫౌండేషన్ వారు పరీక్షలు నిర్వహించి, వారికి రోటరీ క్లబ్ తరపున ఉచితంగా మందులు అందజేశారు. 300 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేపట్టారు. డాక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో స్వామి కంటి ఆసుపత్రి వారు 200 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి సూరిబాబు, ప్రిన్సిపాల్ వి అమృత, వైద్యులు నాగసంతోష్, శ్రవణ్ కుమార్, కల్యాణి, రోటరీ ప్రతినిధులు సెక్రటరీ నీతా విజ్వాని, డాక్టర్ రాజశేఖర్, సూర్యలక్ష్మి, గోవింద, జ్యోతి బచావత్ తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న వైద్యులు

'కోండ్రుని విమర్శించే హక్కు లేదు'

ప్రజాశక్తి రాజాం, వంగర

మాజీ మంత్రి టిడిపి రాజాం నియోజకవర్గ ఇంఛార్జి కోండ్రు మురళీమోహన్‌ను విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదని విజయనగరం జిల్లా టిడిపి బీసీ సంఘం అధికార ప్రతినిధి మరిపి జగన్మోహన్ రావు అన్నారు. ఈ మేరకు ఆయన రాజాంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వంగర మండలానికి చెందిన వైసిపి నాయకులు కోండ్రు మురళీమోహన్ ను తీవ్రంగా విమర్శించడం సిగ్గుచేటన్నారు. మంత్రిగా కోండ్రు మురళీమోహన్ ఈ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి పనులు వారికి తెలియవా అని జగన్ మోహన్ రావు ప్రశ్నించారు. మంత్రిగా కోండ్రు మురళీమోహన్ ఉన్న హయాంలో వెంట ఉండే నాయకులే ఇప్పుడు వైసిపిలో చేరి విమర్శించడం ఎంతవరకు సమంజసమన్నారు. మంత్రిగా ఈ నియోజకవర్గానికి అన్ని విధాల అభివృద్ధి చేసిన ఘనత కోండ్రు మురళీమోహన్ దేనని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనే మడ్డువలస జలాశ ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందించిన సంగతి మరిచిపోయారా అని ప్రశ్నించారు. అధిష్టానం మెప్పుకోసం అన్ని విధాలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన మురళీమోహన్‌ని విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా కోండ్రు మురళి మోహన్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొండ్రు మురళీమోహన్ ఎన్నికయితే నియోజకవర్గం అభివృద్ధి పరంగా పరుగులు తీస్తుందని స్పష్టం చేశారు.

ప్రారంభమెప్పుడో..?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయ సచివాలయం పరిధిలో గల అరిగిపాలెంలో నిర్మించిన పంచాయతీ కార్యాలయం ప్రారంభానికి నోచుకోలేదు. భవనం నిర్మించి రెండు మూడేళ్లవుతున్నా ప్రారంభం కాకపోవడంతో విధులు నిర్వహణకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుల్లో మనస్పర్ధలు కారణంగా భవనాన్ని ప్రారంభించలేదు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల వర్గంగా విడిపోవడంతో ప్రారంభం ఆలస్యమవుతుంది. గ్రూపు రాజకీయాలను పెంచి పోషించడం వల్ల నిర్మించిన భవనాన్ని కూడా ప్రారంభించడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని పంచాయతీ కార్యాలయం